## వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ఎమ్మెల్యే కృష్ణారావు

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణుల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు నూతన ఉత్సాహాన్ని నింపారన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగువచ్చిందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలననే కోరుకుంటున్నారని, అందుకు ఆదివారం సభకు వచ్చిన ప్రజలే ప్రత్యక్ష నిదర్శనమని ఆయన అన్నారు. వరంగల్ సభను విజయవంతం చేసిన కార్పొరేటర్లు, కోఆర్డినేటర్లు, పార్టీ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, మహిళా నాయకులు, నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి'

● జోనల్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి

**కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యలను పరిష్కరించడానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జోనల్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి 17 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు 10, ఇంజనీరింగ్‌కు 5, ప్రాపర్టీ ట్యాక్స్, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చినట్టు జోనల్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జడ్సీ ఆదేశాల మేరకు సంబంధిత సర్కిల్స్ అధికారులకు ఫార్వార్డ్ చేసి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

## ఆత్మరక్షణకు కరాటే దోహదం

● కార్పొరేటర్ శ్రీనివాసరావు


విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

**కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్ కమ్యూనిటీ హాల్లో గాడ్స్ ఓన్ వారియర్స్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ విజేతలకు సర్టిఫికెట్లు, బెల్టులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే లాంటి క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల స్వీయరక్షణ కోసం కరాటే నేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాకుడు అబ్దుల్ నబీ, మాస్టర్ పృథ్వీరాజ్, నాయకులు కృష్ణారెడ్డి, సురేశ్‌రెడ్డి, కోదండ రామయ్య, రుద్రం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న బండి రమేశ్

**బాలానగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. బాలానగర్ పార్టీ కార్యాలయంలో మూసాపేట్‌కు చెందిన తుక్కిశెట్టి యోగేశ్వర్‌కు రూ. 60వేలు, బాలానగర్‌కు చెందిన వెంకటాద్రిరాజేశ్వరికి రూ.32.500, అల్లాపూర్‌కు చెందిన అబేద బికి రూ.60వేలు, ఫతేనగర్‌కు చెందిన బుజ్జమ్మకు రూ.31వేల చెక్కును సోమవారం రమేశ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందాలనే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని ఆయన అన్నారు. రూ. 1,83,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్టు రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, రమేశ్, మేకల రమేశ్, రాజేందర్, వరాల స్వామి, కిట్టు, శివ, అస్లాం, మహేశ్ పాల్గొన్నారు.

# వెలగని వీధి దీపాలు

● జనానికి ఇక్కట్లు ● చీకట్లో అసాంఘిక కార్యకలాపాలు
● పట్టించుకోని అధికారులు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు


ఆల్విన్‌కాలనీలో వెలగని లైట్స్


కేపీహెచ్‌బీ ఫేజ్-7 ప్రధాన రహదారి

**హైదర్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలోని పలు కాలనీల్లో, ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు లేక చిమ్మచీకట్లు అలుముకున్నాయి. జీహెచ్ఎంసీలోని విద్యుత్ అధికారుల నిర్వహణ నిర్లక్ష్యం కారణంగా అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రహదారుల్లోనూ లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో బయటకు వెళ్లేందుకు స్థానికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**వెలగని వీధి దీపాలు..**

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల లోని ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, జీడిమెట్ల, ఉషాముళ్లపూడి ఆస్పత్రి, గాజులరామారం, జీడిమెట్ల పారిశ్రామిక వాడలు నిత్యం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రద్దీగా ఉంటాయి. ఈ ప్రాంతాల నుంచి ఉద్యోగం కోసం హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, మాదాపూర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉషాముళ్లపూడి కమాన్ నుంచి ఎల్లమ్మబండ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంకు అడుగడుగునా అవరోధాలు కలుగుతున్నాయి. ఆల్విన్‌కాలనీ పైపులైను రోడ్డు నుంచి కాలనీ చివరి బస్టాప్ వరకు ఉన్న వీధి దీపాలు, హైదర్‌నగర్ డివిజన్‌లోని ఆదిత్యనగర్, కళామందిర్‌రోడ్, అడ్డగుట, శుభోదయకాలనీ, శ్రీనివాసకాలనీ ప్రధాన రహదారుల నుంచి కాలనీ చివరి వరకు వెళ్లే దారిలో ఎక్కడ వీధి దీపాలు వెలగడం లేదు. ప్రగతినగర్ వెళ్లే దారిలో బార్, వైన్స్‌షాపులు ఉన్నాయి. చీకటిని ఆసరాగా చేసుకుని ఈ రహదారిలో పోకిరీలు నానా హంగామా సృష్టిస్తున్నారు. పలు ప్రాంతాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధి దీపాల నిర్వహణకు ఏటా లక్షల్లో ఖర్చు చేస్తున్నా రహదారుల్లో చీకటి తొలగిపోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


మాధవరంనగర్ హెబ్రోన్ చర్చి లైన్

**వీధి దీపాలు వెలగడం లేదు**

హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీల్లోని చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మహిళలు చీకట్లో బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వచ్చే వాహనాల లైట్ల ఆధారంగా పాదాచారులు రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి.

- పెద్దారావు, స్థానికుడు

## బీజేపీకి బుద్ధి చెబుదాం: కేంద్ర మాజీమంత్రి


కాంగ్రెస్ నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ

**ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన బీజేపీకి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఓల్డుబోయినపల్లి దుబై గేటు నుంచి హస్మత్‌పేట్ వరకు కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ జైసంవిధాన్ సమన్వయకర్త ఉస్మాష కీరతో కలిసి కేంద్ర మాజీ మంత్రి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ, అంబేడ్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు. జైసంవిధాన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన రావడం సంతృప్తినిస్తోందన్నారు. కార్యక్రమంలో వేణు, సతీశ్‌రెడ్డి, పుష్పారెడ్డి, రాఘవేందర్, కిరణ్‌గౌడ్, విజయ్‌కాంత్, అస్లాం, కనకరాజు, మార్కెట్ కమిటీ, టెంపుల్ కమిటీ, బ్లాక్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

● నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ● జేఎన్‌టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన


కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నాకు మద్దతు తెలియజేస్తున్న బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జేఎన్‌టీయూలో కాంట్రాక్టు అధ్యాపకులు తమ ఆందోళనను ఉధృతం చేశారు. వారికి యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంట్రాక్టు అధ్యాపకుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు దామోదరరెడ్డి, వెంకటేశ్, రవికుమార్, బాలరాజు, శంకర్‌యాదవ్, ముస్తాక్, సుఖేశ్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు సురేశ్‌నాయక్, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, కల్యాణ్ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

● బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్

**ఫతేనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ అన్నారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్ మార్కెట్, సమతానగర్, సనత్‌నగర్ రైల్వేస్టేషన్, జింకలవాడ, దీనదయాల్‌నగర్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన 48 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌లో సోమవారం డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. సంఘ విద్రోహశక్తులు, దొంగతనాలకు పాల్పడే వారు, మత్తు పదార్థాలు, డ్రగ్స్ విక్రయించే వారిని గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, ఆలయ కమిటీలు, స్కూళ్లు, కాలేజీలు, వ్యాపార సముదాయాల వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రక్షణగా ఉంటుందని డీసీపీ సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన భరత్‌నగర్ మార్కెట్ సభ్యులు, వ్యాపారులు, స్థానికులను డీసీపీ అభినందించారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతారావు, సనత్‌నగర్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాధాకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

**కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 15, వంకాయ 18, బెండకాయ 32, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 38, క్యాబేజీ 10, బీన్స్ 75, క్యారెట్ 18, గోబిపువ్వు 18, దొండకాయ 18, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 41, ఆలుగడ్డ 26, కీర 21, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 18, కంద 75, ఉల్లిపొరక 23, ఉల్లిగడ్డ 18, మామిడికాయ 15-20, అరటికాయ 8-10, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడదుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 60-70, మునగకాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 80, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 18, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు మంగళవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## శంకర జయంతి ఉత్సవాలు ప్రారంభం


శంకర జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

**కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** జగద్గురు ఆదిశంకరాచార్య భక్తమండలి ఆధ్వర్యంలో తొమ్మిదోఫేజ్‌లోని విజయ గణపతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శంకర జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభయ్యాయి. ఐదురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ప్రారంభించారు. టెంపుల్ బస్టాపులోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఆదిశంకరాచార్యుల ఉత్సవమూర్తిని గజవాహనంపై శోభాయాత్రగా తీసుకొచ్చారు. సంపూర్ణానందగిరి స్వామీజీ ప్రవచనం వినేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు గూడూరు శేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** శ్రీలా పార్క్ ప్రైడ్‌లోని వేంకటేశ్వరస్వామి త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ కొండల్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల 3 వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే1న వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాలనీ అధ్యక్షుడు అల్లూరి మురళీకృష్ణ కోరారు.

## ● కొవ్వొత్తుల ర్యాలీ



పహల్గాంలో పర్యాటకులపై చేసిన దాడులకు, పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మృతికి నిరసనగా క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు సోమవారం మియాపూర్ క్రాస్‌రోడ్డు నుంచి కూకట్‌పల్లి మెట్రో గ్రౌండ్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ ఎడ్వర్డ్ డబ్ల్యూరాస్, రెవరెండ్ ఏసుపాదం పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడికి నిరసనగా సోమవారం ఓల్డుబోయినపల్లిలో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్, సమన్వయకర్త ఉస్మాషకీర పాల్గొన్నారు.

- ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)



ఇండిస్ వన్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో హనుమంతరావు, నారాయణరెడ్డి, రచ్చ వెంకీ, వికాస్, శివరామప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)

# తాటి ముంజలొచ్చాయ్

● పోషక విలువలు కలిగిన ప్రకృతి ప్రసాదం ● శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయంటున్న వైద్యులు


ముంజలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

**బాలానగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** ప్రకృతి ప్రసాదించిన తాటి ముంజలు నగరానికి చేరుకున్నాయి. అలసట నుంచి ఉపశమనం కలిగించి ఆరోగ్యాన్ని అందించే ముంజలంటే చాలా మందికి ఇష్టమే. తాటి ముంజలు ఏప్రిల్, మే నెలలో మాత్రమే లభిస్తాయి. వ్యాపారులు నల్గొండ, మెదక్, వికారాబాద్ జిల్లాలతో పాటు మహానగరాన్ని ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో నగరానికి తీసుకువచ్చి అమ్ముతున్నారు. అత్యధిక పోషక విలువలు కలిగిన తాటి ముంజలను కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.


ముంజలను విక్రయిస్తున్న వ్యాపారి

**తాటి ముంజలకు భలే గిరాకీ...**

వేసవిలో చల్లదనం కలిగించే తాటి ముంజలను కొనుగోలు చేసేందుకు జేఎన్‌టీయూ, కేపిహెచ్‌బీ కాలనీ, మదీనగూడ, మియాపూర్, చందానగర్, ఎర్రగడ్డ, భరత్‌నగర్‌తో పాటు శివారు ప్రాంతాలలోని ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కొందరు వ్యాపారులు మార్కెట్‌లో, రోడ్ల పక్కన పెట్టుకుని అమ్ముతుండగా.. మరికొందరు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు, తోపుడు బండ్ల మీద తిరిగి అమ్ముతున్నారు. ముంజల్లో దాహార్తిని తీర్చే సుగుణాలే కాదు ఆరోగ్యాన్నిచ్చే పోషకాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు సూచిస్తుండడంతో ముంజల అమ్మకాలు ఊపందుకున్నాయి. ముంజలను డజను 150 నుంచి 200కి వ్యాపారులు విక్రయిస్తున్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ముంజలు

**ఔషధ గుణాలివే..**

తాటి ముంజలు వేసవిలో ఒళ్లు మంటల నుంచి ఉపశమనం కలిగించడే కాదు శరీరానికి జల సమతుల్యం చేస్తాయి. వీటిలో పుష్కలమైన మినరల్స్, విటమిన్లు ఉన్నాయి. డీహైడ్రేషన్ నుంచి కాపాడతాయి. జలపదార్థం అధిక మోతాదులో ఉండడంతో దాహార్తిని తీర్చి, ఆకలిని తీర్చుతాయని ఆయుర్వేద వైద్యులు సూచిస్తున్నారు. వంద గ్రాముల ముంజల్లో 29 కేలరీల శక్తి, తేమ- 99 శాతం, ప్రొటీన్లు - 1 గ్రాము, పిండిపదార్థాలు - 6 గ్రాములు, కాల్షియం - 10 మిల్లిగ్రాములు, పాస్ఫరస్ - 2 మిల్లిగ్రాములు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. తాటి ముంజలు తినడం వల్ల శరీరానికి చల్లదనమే కాకుండా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.

**నల్గొండ నుంచి తెచ్చి విక్రయిస్తున్నా**

ముంజలను నల్గొండ నుంచి తీసుకువస్తున్నా. నాతో పాటు మరో నలుగురం కలిసి వ్యాపారం చేస్తున్నాం. నగరంలోని వివిధ ప్రాంతాలలో ముంజలను విక్రయిస్తున్నాం. రోజురోజుకు అమ్మకాలు పెరుగుతున్నాయి. డజను 200 వరకు విక్రయిస్తున్నాం. సీజన్ పూర్తయ్యే వరకు ముంజలు అమ్ముతాం.

- రాయుడు, వ్యాపారి

**ముంజలంటే ఇష్టం**

వేసవి కాలంలో మాత్రమే అరుదుగా లభించే ముంజలు తినడం అంటే చాలా ఇష్టం. అవి తింటే ఎండవేడిమి నుంచి ఉపశమనం కూడా లభిస్తుంది. నా బాల్యంలో వేసవి సెలవుల్లో మా ఊరికి వెళ్లినప్పుడు ముంజల కోసం పోటీ పడి మరీ తెచ్చుకుని తినేదాన్ని.

- నిర్మల, టీచర్స్ కాలనీ, ఓల్డుబోయినపల్లి



సమస్యను పరిష్కరించాలని డీసీ నర్సింహకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

## జంట సర్కిళ్ల ప్రజావాణికి 18 ఫిర్యాదులు

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో జరిగిన ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2, ఇంజినీరింగ్ విభాగానికి 6, వెటర్నరీ విభాగానికి ఒకటి దరఖాస్తులు వచ్చాయి. గాజులరామారం సర్కిల్ జరిగిన ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 3, ఇంజినీరింగ్ విభాగానికి 4, విద్యుత్, రెవెన్యూ విభాగాలకు ఒకొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. ఈ దరఖాస్తులను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని డీసీలు నర్సింహ, మల్లారెడ్డి తెలిపారు. అత్యవసర పనులను సత్వరమే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జలమండలి కార్యాలయంలో రెండు..

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదు అందాయి. వీటిలో సుభాష్‌నగర్, చంద్రగిరినగర్‌లో లోప్రెషర్ కారణంగా తాగునీరు సరిగా రావడం లేదని ఆ కాలనీవాసులు జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం అశోక్ మాట్లాడుతూ త్వరలోనే కాలనీల్లో లోప్రెషర్ రాకుండా తాగునీరును అందిస్తాం అన్నారు.

## కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా : రవిసింగ్

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నానని బీఆర్‌టీ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ పారిశ్రామిక వాడలోని పీకేఎల్ లిమిటెడ్ కంపెనీలో ప్రకాష్ అనే కార్మికుడు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆరోగ్యం బాగా లేనందున కంపెనీకి పోవడం మానేశాడు. దీంతో కార్మిక నాయకుడు రవిసింగ్ యాజమాన్యంతో మాట్లాడి 1.18లక్షలు కార్మికుడికి ఇప్పించాడు. ఆరోగ్యం బాగాలేనందున గుడ్‌విల్‌గా రూ.1.15లక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనీల్, సుదర్శన్, కిరణ్ పాల్గొన్నారు.

## సభ సక్సెస్.. ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు : ఎమ్మెల్యే

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** వరంగల్ ఎల్కతుర్తిలో ఆదివారం బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన కుత్బుల్లాపూర్‌లోని ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విజయోత్సాహంతో బీఆర్‌ఎస్‌ను మరింత శక్తిమంతంగా, ప్రజల ఆశయాలను సాధించే దిశగా ముందుకు తీసుకెళ్లేందకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మహిళా అధ్యక్షురాళ్లు, ఉద్యమకార్లు, పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కాలనీ సంఘాల నాయకులకు అభినందనలు తెలిపారు.

## సూరారం కట్టమైసమ్మ హుండీ లెక్కింపు

**జీడిమెట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** సూరారం కట్టమైసమ్మ ఆలయం హుండీ సోమవారం లెక్కింపు జరిగింది. నెలరోజులకు గాను రూ.1,80,813 వచ్చాయి. దేవాదాయశాఖ అధికారులు అంజయ్య, ఈఓ కృష్ణమాచార్యుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు కొనసాగింది. కార్యక్రమంలో స్థానికులు మన్నేముత్యాలు, భాస్కర్‌రావు, గోపాల్, శేషు, సురేష్, లక్ష్మారెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

## నందాఫుడ్స్‌పై ఫిర్యాదు చేసిన కార్మిక నాయకులు

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** రంగారెడ్డినగర్ డివిజన్‌లోని పారిశ్రామిక వాడలోని నందా ఫుడ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్ కడుతున్నామని చెప్పి వారి జీతాల్లో నుంచి డబ్బులు కట్ చేశారు. కానీ కొంత మంది పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు తమ పీఎఫ్ కోసం అప్లై చేసుకోగా డబ్బులు రాక పోవడంతో కంపెనీ చుట్టూ తిరిగినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారు యూనియన్ నాయకులను ఆశ్రయించారు. దీంతో యూనియన్ నాయకులు సయ్యద్ జిసాన్‌అహ్మద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు తైలం శ్రీనివాస్, నాగరాజు, ఎల్లయ్య, బాలకృష్ణ, గురవారెడ్డి, శ్యామ్‌లు పాల్గొన్నారు.

## మల్లారెడ్డినగర్ అసోసియేషన్ సభ్యుల ఎన్నిక

**గాజులరామారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** గాజులరామారం డివిజన్‌లోని మల్లారెడ్డినగర్ ఫేజ్-1 కాలనీవాసులు సోమవారం నూతన అసోసియేషన్ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పద్మగిరి, ప్రధానకార్యదర్శి సికిందర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఓంకార్‌రెడ్డి, శివరాజ్, హన్మంతరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కృష్ణారెడ్డి, రామ్‌రెడ్డి, కోశాధికారిగా సూర్యచంద్రరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నారాయణనాయుడు, సుబ్బిరామిరెడ్డి, కల్చర్ సెక్రటరీలుగా వెంకటేష్, రవి, చంద్ర, అడ్వైజర్‌లుగా దయాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రమేష్, కార్యవర్గ సభ్యులుగా సతీష్‌రెడ్డి, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, జగదీష్, బ్రహ్మం, శ్యామ్‌సుందర్‌ను ఎన్నుకున్నారు.

## రోడ్డుకు ఇరువైపులా చిన్న దుకాణాల తొలగింపు



మల్లంపేట రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు

**దుండిగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో రోడ్డు వెడల్పు చేసే విషయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్నచిన్న వ్యాపార సముదాయాలను సోమవారం తొలగించారు. హెచ్‌ఎండీఏ అధికారుల ఆదేశాల మేరకు దుండిగల్ మున్సిపల్ అధికారుల, సిబ్బంది ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో మల్లంపేట గ్రామంలో ఆ దుకాణాలను ఎక్సకవేటర్ ద్వారా తొలగించారు. మల్లంపేట గ్రామంలో ఉన్న రోడ్డును 100 ఫీట్లు చేయడానికి రెండు సంవత్సరాల క్రితం అప్పటి అధికారులు పనులు ప్రారంభించారు. కానీ ఊరు విషయానికి వస్తే, స్థానికులు అడ్డుకోవడం వల్ల రోడ్డు వెడల్పు సాధ్యపడలేదు. దీంతో సాయంత్రం సమయాల్లో వెళ్లిన వాహనాల రాకపోకలతో గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ఈ విషయంలో గ్రామానికి చెందిన కొందరు మాజీ ప్రజాప్రతినిధులు తమ ఇళ్లు కూలిపోతాయనే ఆలోచనతో ఎమ్మెల్సీ ఎమ్మెల్యే ద్వారా రోడ్డు వెడల్పు కాకుండా అడ్డుపడుతున్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులకు ఒత్తిడి పెరగడం వల్ల చివరకు ఏమీ చేయలేని పరిస్థితిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్నచిన్న వ్యాపారాల దుకాణాలను తొలగించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అనిల్ కుమార్ (ఫైల్)

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా, బండమాదారం గ్రామానికి చెందిన జక్కుల అనీల్‌కుమార్(27)ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 27న మధ్యాహ్నం దూలపల్లిలోని ఫంక్షన్‌కు వచ్చి, సాయంత్రం గ్రామానికి తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా యూటర్న్ చేస్తూ, ఒకేసారి రోడ్డు మధ్యలో ఆగిపోయింది. దీంతో బైక్‌పై వెళుతున్న అనీల్ కుమార్‌ను లారీ ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి దూలపల్లిలోని రాకేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రాకేష్ వాళ్ల మామ సత్యనారాయణకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నాడు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు చనిపోయాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఇండోర్ వివాదం!

### మంత్రితో స్టేడియాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతున్న వేళ ఎమ్మెల్యే ఓపెన్



షటిల్ ఆడి కోర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్

**జీడిమెట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్‌లో ఇండోర్ షటిల్ స్టేడియం ప్రారంభోత్సవం వివాదస్పదంగా మారింది. ఎస్ఆర్‌నాయక్‌నగర్, అపురూపకాలనీ మధ్య రూ.3కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ స్టేడియాన్ని మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభించడానికి ఇటు అధికారులు, కాంగ్రెస్ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆఘమేఘాల మీద ఎలాంటి ప్రొటోకాల్ పాటించకుండా స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించడం పెద్ద వివాదంగా మారింది. కాంట్రాక్టర్ అత్యుత్సాహం, స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు లేకుండానే స్టేడియం ప్రారంభించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. జీహెచ్‌ఎంసీ, ఇంజనీరింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే ఈకార్యక్రమం జరిగిందని కొందరు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా గాజులరామారం చౌరస్తాలో నిర్మించిన ఓవర్‌హెడ్ ఫుట్‌వేర్ బ్రిడ్జిని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా ప్రారంభించారు. నేడు ఇది ప్రజలకు అందుబాటులో లేకుండా ఉంది.

ఇండోర్ స్టేడియం వివాదానికి కాంట్రాక్టర్ అత్యుత్సాహమే కారణమని, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాక ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారులకు వదిలేసి కాంపౌండ్ వాల్ నిర్మించడం కూడా వివాదంగా ఉంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, బిల్లులు నిలిపివేయాలని కోరుతున్నారు. స్టేడియాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేష్‌రెడ్డి, మన్నేరాజు, పోలే శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ, రమణ, టీటీకె.శ్రీనివాస్, శేషాచారి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

> **అధికారికంగా ప్రారంభిస్తాం**
>
> సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్ నగర్‌లో నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం అధికారికంగా జరిగింది కాదు. ప్రారంభోత్సవానికి మాకు ఎలాంటి సంబంధమూ లేదు. త్వరలోనే మంత్రి చేతుల మీదుగా ప్రొటోకాల్ ప్రకారం స్టేడియం ప్రారంభత్సోవం ఉంటుంది. దీనికి బాధ్యులైన కాంట్రాక్టర్, ఇతరులపై చర్యలు ఉంటాయి.
>
> – ఉపకమిషనర్, కుత్బుల్లాపూర్ సర్కిల్

# నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో 42 ప్లాట్ల గోల్‌మాల్

- ఒకే ప్లాటు.. ఇద్దరు లబ్ధిదారులు
- లబోదిబోమంటున్న అర్హులు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



రాజీవ్‌గృహకల్పలో విలేకర్లు మాట్లాడుతున్న రామచంద్రనాయక్

**నిజాంపేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పా కాలనీలో ఖాళీగా ఉన్న 42 ప్లాట్లు గోల్‌మాల్‌కు గురవుతున్నాయి. అమ్ముకున్న వారికే సొమ్ము అన్న చందంగా ఉంది ఇక్కడి వ్యవహారం. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పా కాలనీలో ఖాళీగా ఉన్న ప్లాట్లను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై కేసులు నమోదు చేసి, అర్హులైన పేదలకు ఆ ప్లాట్లను కేటాయించే విధంగా చూడాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు, అన్ని పార్టీల నాయకులు సమగ్ర విచారణ జరిపి తగిన నిర్ణయం తీసుకొని పేదలకు న్యాయం చేయాలన్నారు. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పా కాలనీలో స్థానికులతో కలిసి సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి, గృహకల్పలో ఖాళీగా ఉన్న 42 ప్లాట్లను అక్రమమార్గంలో అమ్ముకున్న అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లో హౌసింగ్ బోర్డు వారు లబ్ధిదారులకు కేటాయించిన లిస్టులో వారి పేర్లు వచ్చినా కొందరు ఇప్పటికీ ఇళ్లలోకి రాలేదు. ఈ మధ్య కాలంలో కొందరు వచ్చి చూస్తే 'మా ప్లాట్లలో వేరే వాళ్లు ఉంటున్నారు. మా దగ్గర ఉన్న ఆధారాలు వారు కూడా చూపిస్తున్నారు' అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా వదిలేసిన ప్లాటను అప్పటి టీఆర్ఎస్ పార్టీలో నాయకులు, ఇతర పార్టీ నాయుకులుగా చలామని అవుతూ,తమకు తెలిసిన వారిని రంగంలోకి దింపి, వారికి ఇళ్లు ఇపిస్తామని ఆశచూపి, ఒక్కో ప్లాట్‌కు రూ.5 లక్షల నుంచి 8 లక్షల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇళ్లు కేటాయించిన సమయంలో కొందరు బ్యాంక్‌లోన్ తీసుకొని, బ్యాంక్ నిబంధన ప్రకారం రూ.3.5 లక్షల రుణాలు పొంది. ఇంటిని సొంతం చేసుకున్నారు. కొందరు ఆ రుణాలు కట్టలేక అప్పట్లో ఇళ్లలోకి రాలేదు.

ప్రస్తుతం ఆ రుణం కట్టి, ఇంటిని స్వాధీనం చేసుకోవాలని వచ్చిన వారికి దొడ్డిదారిన ప్లాట్లను కొనుగోలు చేసిన వారు దర్శనం ఇస్తున్నారని రామంచంద్రనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ధనవంతులకు, ఇండ్లు ఉన్నవారికే తిరిగి లెటర్లు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి, సమగ్ర విచారణ జరిపితే, అసలు అక్రమదారులు, విక్రయదారులు వెలుగులోకి వస్తారని అన్నారు. నిజమైన పేదలను గుర్తించి వారికి న్యాయం చేయ్యాలని రామచంద్రనాయక్, స్థానికులు, కాలనీవాసులు డిమాండ్ చేశారు.

# వ్యక్తిని బెదిరించిన కేసులో ఐదుగురి అరెస్ట్

- పరారీలో ఇద్దరు
- రూ.5.25లక్షలు, డమ్మీ రివాల్వర్, కత్తి, కారు, ఏడు ఫోన్లు స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఐ సతీష్

**దుండిగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** వ్యక్తిని కిడ్నాప్ చేసి, బెదిరించి డబ్బులు దండుకున్న ఐదుగురుని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5.25 లక్షల నగదు, డమ్మీ రివాల్వర్, కత్తి, కారు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఐ సతీష్ నిందుతుల వివరాలను వెల్లడించారు. ఐదు సంవ్సరాల క్రింతం బలగం వినోద్, తరుణ్ ఇద్దరూ కలిసి రూ.50 లక్షలు పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించారు. వినోద్ ఐదు సంవ్సరాల క్రితమే వ్యాపారం నుంచి తప్పుకొని న్యూజిల్యాండ్‌కు వెళ్లి, ఇటీవల తిరిగొచ్చి, కొంపల్లిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్నాడు. మార్చి 23న వినోద్‌ను కిడ్నాప్ చేసేందుకు తరుణ్ హైదరాబాద్‌కు చెందిన సాయికృష్ణ యాదవ్, సంగారెడ్డికి చెందిన సందీప్, అదే ప్రాంతానికి చెందిన మణిదీప్, హైదరాబాద్‌కు చెందిన వివేక్ రాజ్‌సింగ్, సంగారెడ్డికి చెందిన ఎన్.దేవేందర్‌గౌడ్, అదే ప్రాంతానికి చెందిన సుమంత్ ఆరుగురు మిత్రులతో కలిసి పథకం వేశాడు. ఈ ప్లాన్‌లో భాగంగా గేటెడ్ కమ్యూనిటీ నుంచి వినోద్ కారులో మార్చిలో బయటకు రావడం గమనించి, అతడిని కారులో వెంబడించారు. బౌరంపేట్‌లో గల స్నేక్‌పార్కు వద్ద కారును బలంగా ఢీకొట్టి, వారి వద్ద ఉన్న డమ్మీ రివాల్వర్‌తో బెదిరించారు. వినోద్‌ను కారులో కిడ్నాప్ చేసి, మేడ్చల్‌కు తీసుకెళ్లే క్రమంలో అతిని వద్ద బిట్ కాయిన్‌ను దేవేందర్ పరిశీలించాడు. దీంతో వినోద్‌కు అందులో ఎటువంటి పెట్టుబడులు లేవని నిర్ధారించుకున్నారు. అయితే వివేక్ రాజ్ సింగ్ డమ్మీ రివాల్వర్‌ను సందీప్‌కు ఇవ్వగా అతను ఎస్ఓటీ కానిస్టేబుల్‌ని అని వినోద్‌ను బెదిరించాడు. వినోద్ అకౌంట్ నుంచి రూ.5.25లక్షలను నిఖిల్ చవ్వా అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకొన్నారు. తర్వాత వినోద్‌ను జేఎన్‌టీయూ సమీపంలో మార్చి నెల 24న కారులో నుంచి దించి వెళ్లి పోయారు. అనంతరం నగదను సందీప్, మణిదీప్, దేవేందర్, మనోజ్ సమానంగా పంచుకున్నారు. అప్పటి నుంచి భయపడిన వినోద్ వారి స్నేహితులు, చుట్టాలు ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ నెల 26న దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న దుండిగల్ పోలీసులు నిందితులను సాయికృష్ణ యాదవ్, సందీప్, మణిదీప్, వివేక్‌రాజ్‌సింగ్, ఎం. దేవేందర్‌గౌడ్, సుమంత్‌ను అరెస్ట్ చేశారు. మనోజ్, తరుణ్ పరారీలో ఉన్నారు. వీరి నుంచి రూ.5.25లక్షల నగదు, డమ్మీ రివాల్వర్, కత్తి, కారు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### నిజాంపేట్ కార్పొరేషన్ కార్మికుల మహాధర్నా



నిజాంపేట్ కార్పొరేషన్ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

**నిజాంపేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికులకు రెండు నెలలుగా ఇవ్వని వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి విధులు బహిష్కరించి 5గంటల పాటు కార్మికులు మహాధర్నా నిర్వహించారు. వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికుల వేతనాల కోసం రెండు వారాలుగా కమిషనర్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అయినా అధికారులు స్పందించలేదని, అందుకే ఉదయం నుంచి 5 గంటల పాటు ధర్నా నిర్వహించామన్నారు. మున్సిపల్ జర్నల్ ఫండ్ నుంచి వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ధర్నా చేశామన్నారు. వేతనాలతో పాటు కార్మికులకు పీఎఫ్ ఎంతో కాలంగా కట్ చేస్తున్నారు. అయినా నాలుగు మాసాలుగా పీఎఫ్ సంగతిని ఎత్తి చూపుతూ, ఇంతకాలంలో వారికి ఏ విధంగా వేతనాలు చెల్లించారని ప్రశ్నించారు. కార్మికులు పనిప్రదేశాల్లో ప్రమాదలకు గురైనప్పుడు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారికి భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు ఉన్న అనేక సమస్యలను కూడా సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**జర్నల్ ఫండ్ నుంచి చెల్లిస్తాం**

ధర్నా విషయం తెలుసుకున్న కమిషనర్ సాబేరుఅలీ ఆదేశాలతో మేనేజర్ పవన్ కుమార్ కార్మికులకు కొన్ని హామీలు ఇచ్చారు. వేతనాలు ట్రెజరీ ద్వారా కాకుండా జర్నల్ ఫండ్ నుంచి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈరోజు సాయంత్రం వరకు ఒక నెల వేతనం జమ చేస్తామని అన్నారు. లేనిపక్షంలో మే 2న రెండు మాసాల వేతనాలు అకౌంట్స్‌లో జమ చేస్తామని చెప్పారు. కార్మికులకు ఐడీ కార్డులు తయారు చేసి ఇస్తామని, మిగిలిన అన్ని సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు మేనేజర్‌తో మాట్లాడి మే 2వ తేదీ కల్లా వేతనం ఇవ్వకుంటే, 3వ తేదీ నుంచి విధులు బహిష్కరించి, కార్మికులందరూ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూ సీనియర్ నాయకులు ఏసురత్నం, కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపాలిటీ నాయకులు హరినాథ్ శ్రీనివాస్, వెంకట్‌రాజ్యం, పెంటయ్య, నర్సింహ, శ్రీను, నర్సమ్మ, పుష్పమ్మ, నారాయణమ్మ, మైహిపాల్, వెంకయ్య, చంద్రమ్మ, కార్మికులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నాకు మద్దతు తెలియజేస్తున్న బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

## కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు
- జేఎన్‌టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన ఉధృతం

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జేఎన్‌టీయూలో కాంట్రాక్టు అధ్యాపకులు తమ ఆందోళనను ఉధృతం చేశారు. వారికి యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంట్రాక్టు అధ్యాపకుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వారి సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు దామోదరరెడ్డి, వెంకటేశ్, రవికుమార్, బాలరాజు, శంకర్‌యాదవ్, ముస్తాక్, సుఖ్లేశ్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు సురేశ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, కల్యాణ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

## యాత్రికులపై ఉగ్రదాడి హేయమైన చర్య

**నిజాంపేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** అమాయక యాత్రికులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని యావత్ ప్రపంచం ఈ చర్యను తీవ్రంగా నిరసిస్తోందని జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమల రాజేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా మత రాజకీయాలను పక్కనపెట్టి, మతసామరస్యం, ప్రజాఐక్యత, సంక్షేమం దేశ రక్షణపై దృష్టి కేంద్రీకరించాలని జనజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా అభిప్రాయపడ్డారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళిగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌నుంచి ఎలిఫెంట్ చౌరస్తా, త్రీమంకీస్ చౌరస్తా నుంచి ప్రదర్శన నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర సీనియర్ నాయకులు ప్రొఫెసరర్ కోయా వెంకటేశ్వరరావు, రావుల వరప్రసాద్, చంద్రయ్య, తెలంగాణ పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొని మృతులకు నివాళులర్పించారు.




జమ్ము, కాశ్మీర్‌లో పహల్గాంలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని గాజులరామారం డివిజన్‌లోని కైలాస్‌హిల్స్, మహాదేవపురం కాలనీవాసులు జాతీయ జెండాను పట్టుకొని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనతరం ఉగ్రవాదులను ఉరితీయాలని వారు డిమాండ్ చేశారు.

– గాజులరామారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి



## బీఆర్ఎస్ ప్రజలకు చెప్పిందేమీ లేదు



సొంటిరెడ్డి పున్నారెడ్డి

**గాజులరామారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** వరంగల్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని విమర్శించడం తప్ప బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలను, అమరవీరుల జ్ఞాపకాలను మరిచారని, ప్రజలకు చెప్పిందేమీ లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సభలో ఉన్న తోటి రాజకీయ నాయకులకు పోలీస్ యంత్రాంగానికి ఏ మాత్రం మర్యాద ఇవ్వకుండా సభను నడిపించిన తీరును చూస్తుంటే ఇంకా తెలంగాణ ముఖ్యమంత్రి 'నేనే' అన్న భ్రమలో కేసీఆర్ ఉన్నట్లు వ్యవహరించారని అన్నారు. ఈ సభలో కేవలం పేద ప్రజలు, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడే కాంగ్రెస్ పార్టీని విమర్శించారన్నారు. గతంలో మహిళల గురించి ఏనాడూ పట్టించుకోని కేసీఆర్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఓర్వలేకు పోతున్నారన్నారు.

## చర్చి గాగిళ్లాపూర్‌కు తాగునీరు ఇవ్వండి

**దుండిగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** దుండిగల్ మున్సిపాలిటీలోని చర్చి గాగిళ్లాపూర్ 214 కాలనీవాసులు తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నారని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు వీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి విఘ్నేశ్వరాచార్యులు మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చి గాగిళ్లాపూర్‌కు గత పంచాయతీ, మున్సిపాలిటీ, త్వరలో జీహెచ్‌ఎంసీలో విలీనం అయినప్పటికీ తాగునీటి సమస్య తీరలేదన్నారు. గతంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు మాత్రమే వేసి, మంచి నీటిని ఇవ్వలేదన్నారు.



స్కూల్ బస్సుల యాజమాన్యంతో సమావేశమైన డీటీఓ రఘునందన్‌రావు

## వాహనాల ఫిట్‌నెస్ చేయించుకోవాలి : డీటీఓ

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** వాహనాల ఫిట్‌నెస్‌ను చేయించుకోవాలని మేడ్చల్ డీటీఓ రఘునందన్‌రావు అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ మేడ్చల్ ఆర్‌టీఏ కార్యాలయంలో స్కూల్, కాలేజీ బస్సుల ట్రాన్స్‌పోర్టు మేనేజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బస్సు కండీషన్‌లో ఉండాలని, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించుకోవాలని, బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు ఉండాలన్నారు. అందరూ రవాణా శాఖ రూల్స్‌ను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటారువెహికిల్ ఇనిసెక్టర్స్ శ్రీనివాస్, శిల్పా, కిరణ్‌కుమార్, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన సభ్యులు

## ట్రస్మా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా భీష్మారెడ్డి

మియాపూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యం సంఘం(ట్రస్మా) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శేరిలింగంపల్లి మండలానికి చెందిన భీష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంషాబాద్ మండలానికి చెందిన వెంకటరమణ, కోశాధికారిగా గండిపేట మండలానికి చెందిన ఎండీ రఫీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూల్స్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ట్రస్మా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.రామేశ్వరరెడ్డి, రంగారెడ్డి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి, శేరిలింగంపల్లి అధ్యక్షుడు ఆచార్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌శంకర్, కోశాధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ జాగృతి సభ్యులు

## పహల్గామ్ మృతులకు నివాళి

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు హిందూ జాగృతి లింగంపల్లి ఆధ్వర్యంలో నివాళులర్పించారు గోపీనగర్ హనుమాన్ ఆలయం నుంచి చందానగర్ పీజేఆర్ స్టేడియం మీదుగా లింగంపల్లి చౌరస్తా వరకు జాగృతి ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందూ జాగృతి ప్రతినిధులు మాట్లాడుతూ.. మతం తెలుసుకొని మరీ ప్రజలను హతమార్చడం దుర్మార్గమన్నారు. హిందూ దేశంలో హిందువులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### బీఆర్ఎస్ సభకు
## అడ్డంకులు సృష్టించడం బాధాకరం

- పటాన్‌చెరు డివిజన్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం బాధాకరమని పటాన్‌చెరు డివిజన్ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సభకు ప్రజలు వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తూ బ్యానర్లను చించివేయడం, కార్యకర్తలను నిలిపివేయడం వంటి చర్యలు సిగ్గుచేటన్నారు. వరంగల్ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది తరలివచ్చి జయప్రదం చేశారని, బీఆర్ఎస్‌కు అండగా ఉంటూ మాజీ సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించారని ఆయన పేర్కొన్నారు.

### కార్యకర్తల కృషితోనే సభ విజయవంతం

రాయదుర్గం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కృషితోనే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైందని మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ చేసిన అభివృద్ధి వల్లే రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. పార్టీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.



టీఎన్‌జీఓ కాలనీలో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఎస్‌టీపీ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

రాయదుర్గం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టీఎన్‌జీఓ కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్యకు త్వరలో పరిష్కారం లభించబోతుందని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డం జంగయ్య తెలిపారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఈ ప్రాంతంలో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మించేందుకు కావాల్సిన స్థలాన్ని సోమవారం వాటర్ వర్క్స్ జీఎం వి.సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో మాట్లాడుతూ.. త్వరలో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## 'ఎర్లీబర్డ్'కు మంచి స్పందన

చందానగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ప్రకటించిన ఎర్లీ బర్డ్ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును ఏప్రిల్ నెల చివరి వరకు చెల్లిస్తే 5శాతం రాయితీ పొందవచ్చు. గత ఏడాది రూ.55 కోట్లు వసూలు చేశామని.. ఈ ఏడాది రూ.65 కోట్లు టార్గెట్ కాగా, ఇప్పటి వరకు రూ.45 కోట్ల మేర వసూలు చేసినట్లు చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు.

## కైదమ్మకుంటను సుందరంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని కైదమ్మకుంట చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం జలమండలి అధికారులతో కలిసి చెరువు సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం లోపు పనులు పూర్తి చేసి పరిసర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తామన్నారు. ఏన్నో ఏళ్ల నుంచి ఉన్న కైదమ్మకుంట చెరువు సమస్య త్వరలోనే తీరనుందని, అన్ని రకాల వసతులు, హంగులతో చెరువు ముస్తాబవుతుందని ఆయన పేర్కొన్నారు.



ఆలయంలో ప్రతిష్ఠించనున్న పంచలోహ విగ్రహాలు

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

ఖేల్‌కాలనీ,(ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో నూతన పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకం, సహస్రనామార్చనలు జరిగాయి. ఉత్సవ విగ్రహాల జలాధివాసం, క్షీరాధివాసం నిర్వహించారు.

# కో లివింగ్ హాస్టళ్ల వద్ద వికృత పోకడలు

- గచ్చిబౌలి, మాదాపూర్ ఐటీ జోన్‌లలో స్థానికుల ఇబ్బందులు
- ఆరుబయటే జుగుప్సాకర పనులు
- తమ పిల్లలపై ప్రభావం పడుతుందని స్థానికుల ఆవేదన




తమ కాలనీలోని కో లివింగ్ హాస్టళ్లను మూసి వేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న టీఎన్‌జీఓ కాలనీవాసులు(ఫైల్)

రాయదుర్గం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఐటీ జోన్ పరిసర ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో కో-లివింగ్ హాస్టళ్ల సంస్కృతి పెరిగిపోయింది. దీంతో యువత విచ్చలవిడితనంతో వ్యవహరిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్కృతి కారణంగా పిల్లలతో కలిసి నివసించే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. హాస్టళ్లలో ఉండేవారు రాత్రి, పగలు అనే తేడా లేకుండా వచ్చి వెళ్తుంటారు. యువతీ యువకులు గంటల తరబడి బైకులపై కూర్చొని మాట్లాడుకోవటం, ఇళ్ల ముందు పార్కు చేసిన కార్ల వద్ద రాత్రి సమయాల్లో జుగుప్సాకరమైన పనులు చేస్తుండటంతో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో హాస్టల్స్, కో లివింగ్ హాస్టళ్లను మూసివేయాలని కొన్ని కాలనీల వాసులు డిమాండ్ చేస్తున్నారు. కో లివింగ్ హాస్టళ్లు వెలిసిన తర్వాత యువతలో విపరీత పోకడలు ఎక్కువయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రామ్‌గూడ ఐటీ జోన్‌కు ఆనుకొని ఉన్న పలు కాలనీల్లో హాస్టళ్లు అధిక సంఖ్యలో వెలిశాయి. దీంతో సామాన్య ప్రజలకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

### తమ పిల్లల విషయంలో ఆందోళన..

హాస్టళ్ల నిర్వాహకులు వ్యాపార విస్తరణలో భాగంగా కో లివింగ్ హాస్టళ్ల వ్యవస్థను తీసుకొచ్చారు. ఇప్పటి వరకు ఉమెన్, మెన్స్ హాస్టల్స్ వేర్వేరుగా ఉండేవి. అలా ఉండటంతో ఇరుగు పొరుగు దృష్టి హాస్టల్స్‌పై ఉండేది. యువతి, యువకులు ఏదైనా తప్పు చేస్తున్నట్లు కనిపిస్తే హాస్టల్ నిర్వాహకులకు ఫిర్యాదు చేసేవారు. దీంతో హాస్టల్ నిర్వాహకులు చుట్టు పక్కల వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కో లివింగ్ హాస్టళ్లతో స్థానిక మహిళలు కాలనీలో తిరిగే పరిస్థితి లేదని.. తమ పిల్లలు సైతం ఇలాంటి సంస్కృతి అలవాటు పడిపోతారేమో అనే ఆందోళన కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. లవర్‌తో కలిసి ఉండేందుకు కొందరు స్థానికులు సైతం తల్లిదండ్రులతో ఉండకుండా కో లివింగ్ హాస్టళ్లలో ఉంటున్నారని.. తమ ఇళ్ల ముందే కార్లు నిలిపి అందులో వికృత చేష్టలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నివాసాల మధ్య ఉన్న కో లివింగ్ హాస్టళ్లను మూసివేయాలనే ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### పెరుగుతున్న సమస్యలు

గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లోని టీఎన్‌జీఓ కాలనీ, గౌలిదొడ్డి, కేశవనగర్, ఇందిరానగర్, గచ్చిబౌలి, కొండాపూర్, రాఘవేంద్ర కాలనీ, కొత్తగూడ, టెలికామ్ నగర్, నానక్‌రామ్‌గూడ ప్రాంతాలలో సుమారు 30 సంవత్సరాల క్రితం అప్పటి కుటుంబ వ్యవస్థను పరిగణలోకి తీసుకొని లేఅవుట్‌ల నిర్మాణం చేపట్టారు. అందుకు అనుగుణంగా తాగునీటి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థను కల్పించారు. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతంలో జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలు వెలియడంతో అందులో పనిచేసేందుకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. దీంతో ఇక్కడ అద్దె ఇళ్లకు డిమాండ్ పెరిగింది. ఈ ప్రాంతంలో జీ ప్లస్ వన్ భవనాలు నిర్మించుకునేందుకు అవకాశం ఉండగా కొందరు బిల్డర్లు భారీ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య, రోడ్లపై రద్దీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు హాస్టళ్లు, కో లివింగ్ హాస్టళ్లు రావడంతో స్థానికుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారింది.

# ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగూడ, శిల్పాబృందావన్, మహంకాళినగర్, ఛత్రపతి శివాజీనగర్ కాలనీల్లో సోమవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో వరద నీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, తాగునీటి వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజల విజ్ఞప్తి మేరకు కాలనీల్లో పర్యటిస్తున్నానని, వరదనీటి కాల్వ ఔట్‌లెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం తీసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూస్తామన్నారు. ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

### ట్రాఫిక్ సమస్యకు త్వరలో పరిష్కారం

గచ్చిబౌలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడాకాలనీ వంద అడుగుల రోడ్డును విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని.. ఇందులో భాగంగా రూ.6.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కాలనీవాసులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుడా కాలనీ, గోపన్‌పల్లి, తెల్లాపూర్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, త్వరలో చేపట్టే పనులతో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

## పట్టణాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

- మంత్రి సీతక్క

రాయదుర్గం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని మంత్రి సీతక్క అన్నారు. గ్రేటర్ పరిధిలో నూతనంగా నియమితులైన ఏఈఈలకు గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో 6 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగాల్లో చేరిన ఇంజనీర్లు అంకితభావంతో విధులు నిర్వహించి సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

- ఉపకమిషనర్ ప్రణీత
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

గచ్చిబౌలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని ఉపకమిషనర్ ప్రణీత అన్నారు. ఎక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టినా వెంటనే కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె తన చాంబర్‌లో అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఆమెకు వివరించారు. సర్కిల్ పరిధిలోని శ్రీరాంనగర్ ఏ, బీ, సీ బ్లాకుల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఉపకమిషనర్ ప్రణీత మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలు చేసేవారు ఎంతటివారైనా సరే వాటిని కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. చాలా ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. గచ్చిబౌలి, గౌలిదొడ్డి ప్రాంతాల్లోని జర్నలిస్ట్ కాలనీలో పందుల సంచారం ఎక్కువగా ఉందని, జీహెచ్ఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందిచడంలేదని కాలనీ వాసులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.



శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

### చందానగర్ సర్కిల్ పరిధిలో..

చందానగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్లకు చెందిన పలువురు ప్రజలు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. సాయి మారుతి ఎన్‌క్లేవ్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అవుట్‌లేట్ సరిగా లేకపోవడంతో రోడ్డుపై మురుగు పారుతుందని జనసేన పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ మాధవరెడ్డితో కలిసి కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సంబంధింత అధికారులను ఆదేశించారు.



కార్యక్రమంలో పాల్గొన్న గోపాలకృష్ణ తదితరులు

## ముగిసిన టాలెంట్ హంట్ ట్రైనింగ్ క్యాంప్

రాయదుర్గం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గోపనపలి జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న టాలెంట్ హంట్ ట్రైనింగ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌వీఎస హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో 2028లో జరిగే పారా ఒలంపిక్స్ గురించి వివరించారు. భారత్ పతకాల పంటలో నవోదయ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉంటారన్నారు. ఒలంపిక్స్‌లో 100 పతకాలు సాధించడం కంటే పారా ఒలంపిక్స్‌లో పతకాలు సాధిస్తే దేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎపిస్టిమో విద్యాలయ డైరెక్టర్ పద్మ కొల్లి, హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ సాగరిక, అసిస్టెంట్ కమిషనర్ నాగభూషణం, ప్రిన్సిపాల్ విజయభాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ కేటుగాడి వలలో విశ్రాంత ఉద్యోగి

- రూ. 3.18 లక్షలు పోగొట్టుకున్న వైనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేరళ లాటరీలు కొనిపించి, బహుమతి వచ్చిందని నమ్మించి సైబర్ కేటుగాడు మోసం చేశాడు. ఈ ఉదంతం బషీర్‌బాగ్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నగరానికి చెందిన 76 ఏళ్ల వయసున్న రిటైర్డ్ ఉద్యోగి ఫేస్‌బుక్‌లో కేరళ లాటరీకి చెందిన ప్రకటన చూశాడు. అందులో అతనికి సంబంధించిన వివరాలు నమోదు చేశాడు. వెంటనే వాట్సాప్ ద్వారా సైబర్ నేరగాడు ఫోన్ చేసి కేరళ లాటరీ విధానం గురించి వివరించాడు. వెంటనే టికెట్లు కొని అదృష్టం పరీక్షించుకోవాలని సూచించాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు డబ్బు వెచ్చించి మూడు లాటరీలు కొనుగోలు చేశాడు. కొన్ని రోజుల తర్వాత ఆయన కొనుగోలు చేసిన మూడు లాటరీల్లో రెండింటికి కలిపి రూ.17 లక్షల బహుమతి వచ్చిందని నమ్మించాడు. ఈ డబ్బు ఆయన ఖాతాలో జమ కావాలంటే ముందుగా కొంత నగదు చెల్లించాలని నమ్మించి పలు దఫాలుగా రూ.3.18 లక్షలు తీసుకున్నాడు. ఇంకా డబ్బులు డిమాండ్ చేయడం, ఫోన్‌కు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# కార్మికులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలోకి అడుగు పెట్టే ప్రతీ కార్మికుడు భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా పేర్కొన్నారు. ప్రపంచ భద్రతదినోత్సవం సందర్భంగా సోమవారం పీఈ అండ్ ఎస్‌డీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడు ఉత్పత్తి లక్ష్య సాధనకై చేసే పనిలో భద్రతపై సైతం దృష్టి పెట్టాలన్నారు. భెల్ యాజమాన్యం కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. భద్రతపై శిక్షణను నిరంతరం కొనసాగించాలని, నూతన పద్ధతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ సంస్థను ప్రమాద రహిత ప్రాంతంగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్‌డీవీ కృష్ణంరాజు, ఫ్యాక్టరీ మేనేజర్ ఎన్.విజయ్ సాగర్, చీఫ్ సేఫ్టీ అధికారి అరవింద్‌కుమార్, భద్రత అధికారులు పరశురామ్, హరీష్ బాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న భెల్ ఈడీ కేబీ రాజా



కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నాకు మద్దతు తెలియజేస్తున్న బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

## కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు
- జేఎన్‌టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన ఉధృతం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జేఎన్‌టీయూలో కాంట్రాక్టు అధ్యాపకులు తమ ఆందోళనను ఉధృతం చేశారు. వారికి యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టు అధ్యాపకుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు దామోదర్ రెడ్డి, వెంకటేశ్, రవికుమార్, బాలరాజు, శంకర్‌యాదవ్, ముస్తాక్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు సురేశ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

## చెరువుల అభివృద్ధి పనుల పరిశీలన

మియాపూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పటేల్‌చెరువు, నాయనమ్మకుంట, మక్తామహబూబ్‌పేట పెద్దకుడి చెరువు సుందరీకరణ పనులను సోమవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. డివిజన్ పరిధిలోని చెరువులను అభివృద్ధి చేస్తున్నామని చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, చెరువును మంచినీటితో నింపడంతో పాటు కట్ట బలోపేతం, మొక్కలు నాటడం, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం వంటి పనులు చేయనున్నట్లు తెలిపారు. ఈ చెరువుల సుందరీకరణ పనులు పూర్తయితే పరిసర కాలనీల వాసులకు ఎంతో ఉపయుక్తంగా ఉటుందన్నారు. కార్యక్రమంలో మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులు రామ్, చైతన్య, నాయకులు సుప్రజ, భార్గవ్, కిషోర్, రవి, నాగిరెడ్డి, రామిరెడ్డి, శ్రీధర్, ఈశ్వర్, రాణి తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో తాటిముంజలు విక్రయిస్తున్న వ్యాపారి

## తాటిముంజలకు పెరిగిన డిమాండ్

గచ్చిబౌలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో తాటిముంజలకు గిరాకీ పెరుగుతోంది. శేరిలింగంపల్లిలో ఎక్కడ చూసినా తాటిముంజల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. విక్రయదారులు దూర ప్రాంతాల నుంచి నగరానికి తీసుకువస్తున్నారు. నల్లగొండ, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నారు. 12 ముంజలు 100 రూపాయల నుంచి 150 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. వేసవిలో తాటిముంజలను తింటే డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు.